
# ఓ పాలబుగ్గల జీతగాడా!

శ్రీమధుర్జీ




**అటు ఊరు-**

**ఎత్తయిన మేడలతో, మిద్దెలతో, డాబూ దర్పాలతో, కులం బలంతో, ధనం గర్వంతో- ఠీవిగా తల ఎగరేస్తూ మీసం దువ్వుతున్న అహంకారి భూస్వామిలా దర్జాగా ఉంది.**

**ఇటువాడ-**

కూలినగోడలతో, కుంగిన పాకలతో చింపిరి బతుకులతో వెలి గుర్రైన జీవులతో - దుర్భరంగా, దీనంగా దయనీయంగా బ్రతుకీడ్చే బడుగువారిలా అధ్వాన్నంగా ఉంది.

ఊరింకా సందడిగా మేలుకొనే ఉన్నా- వాడమాత్రం క్రమంగా నీరవ నిశ్శబ్దాన్ని కావలించుకుంటోంది. గుడిసెల్లో గాలికి రెపరెపలాడుతున్న గుడ్డి దీపాలు- రేపటి గురించిన బీదవాని ఆశల్లో మిణుకు మిణుకు మంటున్నాయి. చీకటి బ్రతుకులకు కారణమైన దేవుని నిందిస్తున్నట్లుగా- వీధి కుక్కలు ఉండి ఉండి ఆకాశంలోకి మోరలెత్తి వింతగా వికృతంగా అరుస్తున్నాయి.

గుడిసె ముందు ఆకాశం చూరు కింద కుక్కిమంచంలో పడుకున్న నారిగాడనబడే నారాయణకు మాత్రం - ఎంత ప్రయత్నించినా నిద్ర రావటం లేదు, పెద్దరెడ్డి గారి పొలాల్లో పగలంతా రెక్కలు ముక్కలు చేసుకున్న నారాయణను నిద్రాదేవి తన చల్లని ఒడిలోకి తీసుకుని లాలించకపోవడం ఎంతో అరుదు. అలసిన శరీరం నిద్రకోరుకుంటుంది గాని గాయపడిన మనసు అందుకు సహకరించడం లేదు. ఉదయం పెద్దరెడ్డిగారన్న మాటలే పదే పదే నారాయణ చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. నిజానికవి కేవలం మాటలు కాదు ఆజ్ఞలు- తిరుగులేని సుగ్రీవాజ్ఞలు. ఆ గ్రామంలోని చిన్న చితకా రైతులే పెద్దరెడ్డి గారి మాటను జవదాటలేరు. జవదాటి పరువు మర్యాదలతో బ్రతుకలేరు. ఊర్లోని రైతుల పరిస్థితులే అలాగుంటే- ఇక వాడలోని బడుగు జీవుల గురించి ప్రత్యేకంగా చెప్పాలా?

ఇక నిద్ర కోసం ప్రయత్నించి లాభం లేదనుకొని కుక్కిమంచంలోంచి లేచి కూర్చున్నాడు నారాయణ. పక్క మంచంలో భార్య నరిసి, ఆమె నడుం చుట్టూ కాళ్ళు బిగించి బాలయ్య- ఇద్దరూ గాఢ నిద్రలో ఉన్నారు. చూరుకింద అరుగు మీద పదహారేళ్ల కాశయ్య కూడా మంచి నిద్రలో ఉన్నాడు. భార్య పక్కలో అమాయకంగా నిద్రపోతున్న బాలయ్య వంక దీక్షగా చూసి చూసి నారాయణ బాధతో తలతిప్పుకున్నాడు. ఆ చీకట్లో కూడా నారాయణ కళ్లల్లో కన్నీళ్ళు మెరిశాయి.

బాలిగాడని వాడలోని వారందరిచేతా పిలువబడే బాలయ్య- నారాయణ రెండవ కొడుకు. ఎనిమిదేళ్ళు నిండి తొమ్మిదిలోకి అడుగుపెట్టాడు. వాడలోని ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్లో మూడవ తరగతి. ఉదయాన్నే చద్దికూడు తిని, విరిగిన దువ్వెనతో పగిలిన అద్దంలో చూసుకుని దువ్వుకొని, కట్లు ఊడిన పలకను, అట్టలు చిరిగిన పుస్తకాలను చంకన వేసుకుని, జారిపోతున్న నిక్కరును పైకిలాక్కుంటూ హుషారుగా బడికి వెళ్ళే బాలయ్యను చూస్తుంటే నారాయణకు నరిసికి ఇట్టే కడుపు నిండిపోతుంది. చింపిరి బట్టలతో శ్రద్ధగా బడికి వెడుతున్న ఆ కుర్రాడి భవితవ్యం - రంగు రంగుల ఇంద్రధనుస్సులా ఆ బడుగు తల్లిదండ్రుల కళ్ల ముందు మెదిలి వారిని ఆనందంతో ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. తన తాతకు, తండ్రికి, తనకు చివరకు తన పెద్దకొడుకు కాశయ్యకు కూడా దక్కని చదువు- తమ బాలిగానికి దక్కుతున్నందుకు - నారాయణ ప్రతిరోజూ ఒక్కసారైనా కనిపించని ఆ దేవునికి కృతజ్ఞతతో దండం పెట్టుకుంటాడు. మట్టిపిసికి పొట్టపోసుకునే తన కడుపున పుట్టినందుకు తనలానే ఆ మట్టిలో బ్రతుకు వెళ్లదీసుకోకుండా - తన కొడుకు బాగా చదువుకొని దర్జాగా రెడ్డిబిడ్డలా బ్రతకాలన్నదే నారాయణ నిండైన కోరిక. చీకటిపడ్డాక బాలిగాడు అరుగుమీద కిరసనాయిలు దీపం ముందు కూర్చుని తెలుగువాచకం చదువుతుంటే - అలా కొడుకు కేసి ఆనందంగా కళ్లప్పగించి చూస్తూ కలల్లో తేలిపోతున్న ఆ బీద తండ్రిని - మురిపెంగా కోపగించుకుంటూ ఆట పట్టిస్తుంటుంది భార్య నరిసి. కొడుకు చదువు వారి బ్రతుకులలో ఒక పండుగ... ఒక ఆనందపు వెల్లువ... ఒక అందమైన భవిష్యపు రంగుల కల...

కానీ - ఇప్పుడా రంగులకల చెదిరిపోబోతోంది. ఆ ఆనందపు వెల్లువ హఠాత్తుగా ఇంకిపోబోతోంది. ఆ పండుగ సంబరంలో ఎక్కడో అపశృతి వినపడబోతోంది. ఆ ఆలోచనలే ఉదయం నుంచి నారాయణ మనసులో మంటలు రేపుతున్నాయి, గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

తెల్లవారక ముందే చీకటిని మోసుకుంటూ పెద్దరెడ్డి గారి పనిలోకి వెళ్లాడు నారాయణ. అప్పుడు తెలిసింది పిడుగులాంటి వార్త. పెద్దరెడ్డి గారి సేద్యగాడు రామిగా

